సాక్షి తిరుపతి

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



దోపిడీ 'ఖ'నిజం!

సైదాపురం: విలువైన ఖనిజం కోసం రాత్రికి రాత్రే కొండను తవ్వేశారు. కోట్ల రూపాయల సంపదను కొల్లగొట్టేశారు.

8లో



నాగలాపురం ఎర్రచెరువు ఖాళీ

పిచ్చాటూరు : చేపల వేలం పేరుతో నాగలాపురం మండలంలోని ఎర్రచెరువులో ఉన్న నీటిని బయటకు విడుదల చేశారు.

8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	40	22
చిత్తూరు	40	22
తిరుమల	36	19
గూడూరు	42	24
నగరి	41	23

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం(సా)	సహర్ బుధవారం(ఉ)
తిరుపతి	6.29	4.36
చిత్తూరు	6.31	4.36
పుంగనూరు	6.33	4.40

ఆరోగ్య భాగ్యం!



'ప్రతి పేదవాడికీ కార్పొరేట్ వైద్యం అందాలి. ఆస్పత్రులకు వెళ్లిన రోగులకు అక్కడే అన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలి. అవసరమైన మందులు అందించాలి. చాలినంతమంది సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో ఉండాలి' అన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను బలోపేతం చేసింది. నాడు-నేడుతో వాటి రూపురేఖలను సమూలంగా మార్చేసింది. కార్పొరేట్‌ను తలదన్నేలా చూడముచ్చటగా తీర్చిదిద్దింది. అవసరం మేరకు సిబ్బందిని నియమించి రోగుల బాగోగులను చూస్తోంది. దీనిపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

– సాక్షి, తిరుపతి

ప్రాథమిక' ఆరోగ్యం భేష్

- ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్ ఆస్పత్రులను తలపిస్తున్న పీహెచ్‌సీలు
- ఆస్పత్రుల నిండా సిబ్బంది, పరికరాలు, మందులు
- అందుబాటులో 55 టెస్టులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రోగులు

నా పేరు పద్మజ. నా భర్త పేరు విజయ్. మాది ఏర్పేడు మండలం, పాపానాయుడుపేట. రెండు రోజుల క్రితం పురిటినొప్పులు వచ్చాయి. భయమేసింది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఊర్లో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లాం. అక్కడ ఉష సిస్టర్ ఇబ్బంది లేకుండా కాన్పు చేశారు. పైసా ఖర్చులేకుండా క్షేమంగా ఇంటికి పంపించారు. పీహెచ్‌సీలో అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వానికి, ఆస్పత్రి సిబ్బందికి రుణపడి ఉంటాను. ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.



నా పేరు కన్నమ్మ. చిత్తూరు మండలం, నల్లవెంకటయ్యగారిపల్లె. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి డబ్బులు ఇచ్చుకునే బాధ తప్పింది. ఎన్‌ఆర్‌పేట వద్ద ప్రభుత్వాస్పత్రికి వెళ్తే వాళ్లే చెక్‌చేసి మందులు ఇచ్చి పంపుతున్నారు. ఇప్పుడు కొత్తగా ఆస్పత్రికి వెళ్లలేని వారి ఇంటికే డాక్టర్లు వచ్చి చూసి వెళ్తున్నారు. నర్సులు, డాక్టర్లు రోజూ ఇంటికొచ్చి సలహాలు,సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం ఆస్పత్రులను బాగు చేసింది. మాలాంటి పేదోళ్లకు అండగా నిలిచింది. ఆనందంగా ఉంది.

టీడీపీ హయాంలో..

పగిలిన కిటికీలు.. ఊడిపోయిన తలుపులు.. మసిబారిన గోడలు.. శిథిలావస్థలో భవనాలు.. దెయ్యాల మేడలు తలపించేలా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు కనిపించేవి. సిబ్బంది కొరత రోగులను తీవ్రంగా పీడించేది. ఇద్దరుముగ్గురు సిబ్బందితోనే ఆస్పత్రిని నెట్టుకురావాల్సి దుస్థితి ఏర్పడేది. ఉన్న సిబ్బంది కూడా సమయానికి రాక అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొనేది. డాక్టర్లు చుట్టపుచూపుగా వచ్చి వెళ్లడం రివాజుగా మారేది. సొంత క్లినిక్‌లపై మోజు పెంచుకుని ప్రభుత్వాస్పత్రులను గాలికొదిలేసినా అడిగే నాథుడే ఉండేవారు కాదు. ఇక మందులు, వైద్య పరీక్షలు, కాన్పుగ్రూ అంటే ఉన్న అరకొర సిబ్బంది ప్రయివేటు ఆస్పత్రులకు రెఫర్ చేయడం క్షణాల్లో జరిగిపోయేది.

నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో..



చిన్నపాండూరు వద్ద త్వరలో ప్రారంభించనున్న పీహెచ్‌సీ నూతన భవనం

కళాత్మకమైన రంగులు.. అధునాతన పరికరాలు.. ఆధునిక సౌకర్యాలు.. కావాల్సినన్ని మందులు.. అందుబాటులో వైద్య పరీక్షలు.. ఆస్పత్రుల నిండా సిబ్బంది, డాక్టర్లు.. అబ్బో.. చూస్తే కార్పొరేట్ తలదన్నేలా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దింది. ప్రతి పీహెచ్‌సీలో 55 వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తోంది. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పనితీరు, సిబ్బంది హాజరుపై నిరంతరం పర్యవేక్షణ పెడుతోంది. ఇక ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ సిబ్బంది కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపట్టింది. 108 వాహనాల్లో ఓ డాక్టర్ విధులు నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంది. ఆస్పత్రికొచ్చిన ప్రతి గర్భిణీకి సుఖప్రసవం అయ్యేలా సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. ఒక్కోకాన్పునకు రూ.4వేల చొప్పున ఆయా పీహెచ్‌సీలకు ప్రోత్సాహం కింద చెల్లించడం వారిలో మరింత ఉత్సాహాన్ని నింపింది. కడుపు కోతల్లేని కాన్పులకు కేరాఫ్ అడ్రస్‌గా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను తీర్చిదిద్దింది.



కాన్పు అనంతరం పురిటి బిడ్డను తల్లి పద్మజకు చూపిస్తున్న ఏఎన్‌ఎం (ఫైల్)



పాపానాయుడుపేట పీహెచ్‌సీలో అర్ధరాత్రి సమయంలో మహిళకు కాన్పు చేస్తున్న ఏఎన్‌ఎం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా రోగుల నివాసాలకు వెళ్ల వస్తున్న వైద్యులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

పీహెచ్‌సీలు: 108

24 గంటలు పనిచేసే ఆస్పత్రులు: 78

ప్రతి పీహెచ్‌సీలో ఉన్న సిబ్బంది: 14

కేడర్	ప్రస్తుతం ఉన్న సిబ్బంది
సివిల్ అసిస్టెంట్ సర్జన్	02
స్టాఫ్ నర్సులు	03
ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2	01
ఫార్మసిస్ట్ గ్రేడ్ 2	01
సీహెచ్‌ఓ/ఎంపీహెచ్‌ఓ	01
హెల్త్ ఎడ్యుకేటర్/పీహెచ్ఎన్	01
ఎంపీహెచ్ఎస్(ఎఫ్)	01
ఎంపీహెచ్ఎస్(ఎం)	01
ఎల్‌డీ కంప్యూటర్/జూనియర్	
అసిస్టెంట్/సీనియర్ అసిస్టెంట్	01
ఎఫ్ఎన్‌ఓ	01
శానిటరీ అటెండర్, వాచ్‌మన్	01

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్ లేకుండా చేసిన కాన్పులు

నెల	సాధారణ కాన్పు	ఆపరేషన్‌లు	మొత్తం
ఏప్రిల్-2022	88	0	88
మే	102	0	102
జూన్	112	0	112
జూలై	103	0	103
ఆగస్టు	78	0	78
సెప్టెంబర్	92	0	92
అక్టోబర్	82	0	82
నవంబర్	107	0	107
డిసెంబర్	116	0	116
జనవరి	100	0	100
ఫిబ్రవరి	87	0	87
మార్చి	69	0	69
మొత్తం:	1,136		1,136

న్యూస్‌రీల్

మే 10న పాలిసెట్ ప్రవేశ పరీక్ష

- దరఖాస్తుకు ఈనెల 30 ఆఖరు
- 18 నుంచి మే 5 వరకు ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి, తత్సమాన విద్యార్హతతో 2023-24 విద్యాసంవత్సరంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి మే 10వ తేదీ పాలిసెట్-2023 ప్రవేశ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు తిరుపతి కేటీ.రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా, అలాగే సమీప ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లోని హెల్ప్‌లైన్ సెంటర్ల ద్వారా చేసుకోవచ్చని పేర్కొన్నారు. పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఈ నెల 18 నుంచి మే 5వ తేదీ వరకు తమ కళాశాలలో రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 94402 10803 సెల్ ఫోన్ నంబరులో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

పది పరీక్షకు 19 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: జిల్లాలో సోమవారం 95 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పదో తరగతి కాంపోసైట్ కోర్సు-2/ ఓఎస్ఎస్‌సీ పేపర్-1, సబ్జెక్టులో పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 7,898 మంది హాజరుకావాల్సి ఉండగా.. అందులో 19 మంది గైర్హాజరైనట్టు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఓఎస్ఎస్‌సీ పేపర్-2/ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు సబ్జెక్టులో పరీక్ష జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

29 నుంచి 'అమృత గాన నీరాజనం'



మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: ఘంటసాల, సాలూరి రాజేశ్వరరావు, ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 29, 30 తేదీల్లో మహతి కళాక్షేత్రంలో అమృతగాన నీరాజనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సీఆర్‌కే. శేషగిరిరావు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అమృతగాన నీరాజనం ఉంటుందన్నారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాలలో నిర్వహించే సంగీత పోటీలలో పాల్గొనదలిచిన వారు రూ.300, రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 27న సాయంత్రం 6 గంటల్లోపు 9440271154, 944009978లలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

20న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి తుడా : స్థానిక శ్రీ పద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్స ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన రెండేళ్ల కాలపరిమితితో పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ పోస్టుల భర్తీకి ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఆస్పత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు టీటీడీ పీఆర్వో ఒక ప్రకటనలో తేలిపారు.

ఏ కష్టమొచ్చినా ముందుంటా!

- రేణిగుంట ఫ్లైఓవర్ నిర్వాసితులకు ఇంటిపట్టాల పంపిణీ
- తాగునీటి సమస్య పరిష్కరిస్తా
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



రేణిగుంటలో ఫ్లైఓవర్ నిర్వాసితులకు ఇంటిపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: 'మాకు నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీనిచ్చిన మండలం రేణిగుంట. రేణిగుంట అభివృద్ధికి ప్రాధాన్యతాక్రమంలో అన్ని పనులు చేసుకుంటూ ముందుకెళుతున్నాం. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముందుంటాం'అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. రేణిగుంట ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం రేణిగుంట ఫ్లైఓవర్ కోసం ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 95 మంది లబ్ధిదారులకు రేణిగుంట పట్టణ సమీపంలో స్థలాలను గుర్తించి పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటిస్థలాల కోసం దాదాపు 15 ఏళ్లుగా రేణిగుంట ఫ్లైఓవర్ నిర్వాసితులు పోరాడుతున్నారని, తన కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి గత ఎన్నికల ముందు సమస్యను గుర్తించి ఆ నాడే వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామని మాట ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం నిర్వాసితులకు విలువైన స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇంటిస్థలాలు ఇవ్వడమే కాకుండా అక్కడ తాగునీటి కొళాయిలు, రోడ్లు, విద్యుత్ సరఫరాను నెల రోజుల్లోపు పూర్తిచేస్తామన్నారు. రేణిగుంట తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రూ.2కోట్లు వ్యయంతో తెలుగుగంగ నుంచి రెండవ లైను ద్వారా నీటి పంపింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రేణిగుంట గుంటకట్టను పార్క్‌గా అభివృద్ధి చేసి సుందరీకరణ పనులు చేపట్టేందుకు తుడా నిధులు రూ.3 కోట్లు మంజూరు చేసిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటిపట్టాలతోపాటు చీరలు పంపిణీ చేశారు. రేణిగుంట మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్య, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో హరిబాబు, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, జువ్వల దయాకర్‌రెడ్డి, గంగారి రమేష్, మన్యం శ్రీనివాసులురెడ్డి, రహీం, రసూల్, యోగేశ్వరరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, ఖదీర్ పాల్గొన్నారు.

నిరీక్షణ ఫలించింది



మేము లక్షల రూపాయల విలువైన ఇంటిస్థలాలు ఫ్లైఓవర్ వంతెన కోసం పోగొట్టుకున్నాం. ఇంటిస్థలాల కోసం ఏళ్ల తరబడి అందరి నాయకుల చుట్టూ తిరిగాం. ఎవ్వరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మాకు ఇంటిస్థలాలు ఇప్పించి మాట నిలబెట్టుకున్నారు. సంతోషంగా ఉంది.

– కమలమ్మ, నిర్వాసితురాలు

ఓటేసి రుణం తీర్చుకుంటాం



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుని మాకందరికీ ఇంటిపట్టాలు ఇప్పించారు. ఇంటిస్థలాలు వస్తాయన్న ఆశ లేదు. అలాంటిది మమ్మల్ని పిలిచి మరీ పట్టాలు, చీర కానుకగా అందించడం చాలా సంతోషంగా ఉంది. రానున్న ఎన్నికల్లో ఆయనకు ఓటేసి రుణం తీర్చుకుంటాం.

– తాహిదా, నిర్వాసితురాలు

శ్మశాన వాటిక సమస్య పరిష్కారం



సూళ్లూరుపేట క్రైస్తవుల బరియల్ గ్రౌండ్ సమస్యను స్పందనలో కలెక్టర్‌కు వివరిస్తున్న ఎంపీ మద్దెల గురుమూర్తి

తిరుపతి అర్బన్ : సూళ్లూరుపేట ప్రాంతంలో క్రైస్తవులకు సరైన శ్మశాన వాటిక లేకపోవడంతో దీర్ఘకాలికంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈమేరకు యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తిని కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఆయన సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కే వెంకటరమణారెడ్డిని కలిసి సూళ్లూరుపేట ప్రాంతంలో క్రైస్తవులకు బరియల్ గ్రౌండ్ సమస్య నెలకొందని వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ వెంటనే క్రైస్తవులకు అనుకూలమైన ప్రాంతంలో బరియల్ గ్రౌండ్ ఏర్పాటు చేయడానికి స్థలాన్ని కేటాయించాలని ఆర్డీఓను ఆదేశించారు. దీంతో పాస్టర్స్ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు ఆవల ప్రసాద్, సురేష్, వరప్రసాద్, ప్రభుదాస్, ప్రసాద్, రమేష్, రవికుమార్, వేదనాయకం తదితరులు ఉన్నారు.

నేడు 20వ బ్యాచ్‌కి శిక్షణ

తిరుపతి అర్బన్ : అలిపిరి డిపోలోని ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో మంగళవారం నుంచి 20వ బ్యాచ్‌కి శిక్షణ ఇవ్వనున్నట్ట డిపో మేనేజర్ హరిబాబు సోమవారం పేర్కొన్నారు. ఇప్పటికే 19 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తయిందని, ఇందులో 304 మంది హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లకు అర్హత పొందారని తెలి పారు. అదేవిధంగా మంగళవారం నుంచి 21వ బ్యాచ్‌కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు.

సదరమ్ సర్టిఫికెట్ల పేరుతో మోసం

- రుయా అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు




సుబ్రమణ్యం



బాధితుడు లక్కరాజు వెంకటేష్

తిరుపతి తుడా : 'నా పేరు లక్కరాజు వెంకటేష్. నా కొడుకు దర్శిల్ గ్రహణ మొర్రి సమస్యతో బాధపడుతున్నాడు. పింఛన్ కోసం సదరమ్ సర్టిఫికెట్ అవసరమైంది. రుయాకు వచ్చి విచారిస్తుండగా సుబ్రమణ్యం అనే వ్యక్తి తారసపడ్డాడు. తనకు రూ.50 వేలు ఇస్తే సదరమ్ సర్టిఫికెట్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో దశలవారీగా సుబ్రమణ్యం వ్యక్తిగత అకౌంట్‌కు రూ.50 వేలు ఫోన్‌పే ద్వారా పంపా. ఏడు నెలలవుతున్నా సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో రుయాకు వచ్చి విచారించగా అసలు విషయం బయటపడింది. సుబ్రమణ్యం మాఫియా డాన్ అని, గతంలోనూ అతనిపై ఫిర్యాదులు ఉన్నట్టు తెలుసుకున్నా. నాకు న్యాయం చేయండి.. నా బిడ్డకు పింఛన్ ఇప్పించి ఆదుకోండి' అంటూ నింద్ర మండలం, ఆరూరు గ్రామానికి చెందిన లక్కరాజు వెంకటేష్ సోమవారం రుయా వద్దకు వచ్చి బోరున విలపించాడు. ఆపై రుయా సూపరింటెండెంట్ డాక్టర్ నాగమణింద్రుడికి ఫిర్యాదు చేశాడు.

విశేష 'స్పందన'



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 119 అర్జీలు వచ్చినట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జేసీ డీకే బాలజీ, డీఆర్వో శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖతో కలిసి అర్జీలు స్వీకరించారు. అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ స్పందనకు ప్రతి విభాగానికి చెందిన అధికారి హాజరుకావాలని ఆదేశించారు.

స్పందనకు 63 ఫిర్యాదులు



మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 63 ఫిర్యాదులు వచ్చినట్టు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి సకాలంలో పరిష్కారమయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందినట్టు ఆయన వెల్లడించారు.

వామ్మో..కొండచిలువ!



రాజీవ్‌నగర్ వీధుల్లో సంచరిస్తున్న కొండచిలువ

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ రాజీవ్‌నగర్‌లో పాముల బెడదతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. స్థానిక పురవీధుల్లో సైతం విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో పంచాయతీవారు వీధి లైట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో తరచూ వీధుల్లో పాములు సంచరిస్తున్నాయి. తాజా గా సోమవారం రాత్రి ఏకంగా కొండచిలువ రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఇప్పటికైనా మండల విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వీధుల్లో స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎవరూ ఆకలితో అలమటించొద్దు!

- వారపు సంతల్లో ఉచిత భోజన వితరణ
- పాకాల సంతలో 12 రకాల వంటకాలు వడ్డించిన ఎమ్మెల్యే సతీమణి లక్ష్మి



వారపు సంతలో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి

పాకాల: అన్నంపెట్టే చేయ్యే అర్థించరాదన్న సదుద్దేశంతో చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని వారపు సంతల్లో రైతులు, వ్యాపారులెవ్వరూ భోజనం కోసం ఎదురుచూడరాదన్న ఉద్దేశంతో తన సొంత నిధులు వెచ్చించి భోజన వితరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా పాకాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వారపు సంతలో సోమవారం ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి చేతుల మీదుగా చికెన్ బిర్యానీతో పాటు 12 రకాల రుచికరమైన, నాణ్యమైన వంటకాలను వడ్డించారు. సన్న, చిన్నకారు రైతులు, వ్యాపారులు భోజనం కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండకూడదని, ఆకలితో అలమటించే దుస్థితి రాకూడదని ఎమ్మెల్యే ఈ భోజన వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఆమె వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే వారపు సంతల్లో ఈ భోజన వితరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అంతే కాకుండా వారపు సంతలు, ప్రైవేట్ బస్టాండ్‌లు, డైలీ మార్కెట్, ఇలా రైతులకు, వ్యాపారస్తులు, ఆటో కార్మికులు రుసుము చెల్లించే అవసరం లేకుండా ఎమ్మెల్యే తన సొంత నిధులను వెచ్చించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులు ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, సర్పంచ్‌లు ఎస్.కస్తూరి, గౌరీశంకర్, కళావతి, కపిలేశ్వర్‌రెడ్డి, హరిరెడ్డి, మునీర్, సురేష్, వినాయక, మునిరత్నంరెడ్డి, రమేష్, ఖాజామస్తాన్, అల్తాఫ్ పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం:

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.63,560
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,588

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.77,600
రిటైల్ వెండి గ్రాము	రూ.79.60

మద్యం విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని విక్రయిస్తున్న పి.చంద్రశేఖర్ (43) అనే వ్యక్తిని టాస్క్ ఫోర్స్ (డీటీఎఫ్) పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. చిత్తూరు–చిత్తపార రూట్‌లో సి.బండపల్లె వద్ద సీఐ మాధవస్వామి, మస్తాన్‌వలీ తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు పట్టుబడ్డాడు. 32 టెట్రా ప్యాకెట్లు, మధ్యప్రదేశ్‌కు చెందిన 6 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ముక్కంటి సేవలో మిస్ ఇండియా భావన



భావనకు జ్ఞాపిక అందజేస్తునన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం తిరపతి జిల్లాకు చెందిన మిస్ ఇండియా ఐకానిక్ సీజన్–3 విజేత భావన దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం అందించగా ఎమ్మెల్యే, ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన జిల్లాకు చెందిన భావన మిస్ ఇండియా కావడం సంతోషంగా ఉందన్నారు.



మిస్ ఇండియాను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

రాష్ట్రానికి వన్నె తెచ్చిన మిస్ ఇండియా భావన

తిరుపతి కల్చరల్: స్త్రీ అబల కాదు... సబల అని మిస్ ఇండియా ఐకాన్ విజేతగా నిలిచిన భావన నిరూపించారని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కొనియాడారు. తిరుపతికి చెందిన భావన ఇటీవల మిస్ ఇండియా ఐకాన్ విజేతగా నిలిచిన విషయం తెల్సిందే. ఈ సందర్భంగా ఆమెను తన కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మునిరామిరెడ్డి, తిరుమలరెడ్డి, శివారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, మునిభూషణం, బాలాజీరెడ్డి, కేశవులురెడ్డి, డాక్టర్ బాబు పాల్గొన్నారు.

సరికొత్త పుంతల్లో కార్మికోద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు చౌదరి

తిరుపతి కల్చరల్: కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్మిక ఉద్యమాన్ని సరికొత్త పుంతలు తొక్కించాలని ఐఎఫ్‌టీయూ అఖిల భారత మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కేవీ.చౌదరి పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ అఖిల భారత మహాసభల్లో రెండో రోజు సోమవారం ఎస్ఎస్‌బీ కల్యాణ మండపంలో ఐఎఫ్‌టీయూ ప్రతినిధుల సభ నిర్వహించారు. తొలుత ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ కార్మికుల జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు అగ్రనేతలు సాగించిన ఉద్యమ జీవితాన్ని స్ఫూర్తిదాయకంగా చెప్పారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ చట్టంతో జిల్లాలోని చిన్న తరహా పరిశ్రమలు, సాంప్రదాయ, వ్యాపార, వర్తక, వాణిజ్య రంగాలు దెబ్బతింటే పారిశ్రామిక ప్రాంతాలు విలవిల్లాడాయని పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, పాలకుల విధానాలతో నిరుద్యోగం, దారిద్ర్యం, పేద, ధనికుల మధ్య తారతమ్యం ఎక్కువగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐకేఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వెంకటరత్నం, అధ్యక్షుడు వెంకయ్య, ఐఎఫ్‌టీయూ నేత జీవన్‌కుమార్, ఎన్‌డీఎల్‌ఎఫ్ నేత వి.కన్నన్, ఎంకేకే.శరవణ్, బెంగాల్‌కు చెందిన ఎస్‌డబ్ల్యూసీసీ నేత అమితాబ్, ఏఐఎఫ్‌టీయూ నేత విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదల గుండెల్లో సీఎంకు సుస్థిర స్థానం



గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



వైఎస్ఆర్ సీపీలో చేరిన నాయకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న దృశ్యం

- గడప గడపకు మహా పాదయాత్రలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

భాకరాపేట: రాష్ట్రంలో విప్లవాత్మకమైన సంస్కరణలతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల మనసులో సుస్థిర స్థానాన్ని సాధించారని చంద్రగిరి వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎర్రవారిపాళెం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. గడపగడపకు మహా పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా ఉదయం 7 గంటలకే నెరబైలు పంచాయతీలోని పల్లె గడపలు తొక్కారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని గడప గడపకూ వెళ్లి లబ్ధిదారులకు వివరించారు. బండమీద కమ్మపల్లిలో ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. నెరబైలు పంచాయతీ పార్టీ శ్రేణులు మోహిత్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. పాత తురకపల్లిలో రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తీవ్ర ఎండను సైతం ఆయన లెక్కచేయక కుమ్మరగడ్డ వారి పల్లి నుంచి బెల్లంవారి పల్లి, బండమీద కమ్మపల్లి, బిజ్జేవారిపల్లి, కొంగరవారిపల్లి, పులిబోనుపల్లి, వైఎస్సార్ జగనన్న కాలనీ, బీసీ కాలనీ, గిరిజన కాలనీ, పాతతురక పల్లె, చింతకాయల హరిజనవాడ, ఊటబావులపల్లి మీదుగా పాదయాత్ర కొనసాగించారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతల చేరిక

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో బండమీద కమ్మపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేతలు వేణుగోపాల్ నాయుడు, గుర్రప్పనాయుడు, హర్షవర్ధన్‌నాయుడు, బుల్లినాయుడు, సిద్ధయ్యానాయుడు, హరి, మురుగేష్‌చౌదరి(చౌదరి) తదితరులు వైఎస్ఆర్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు.

రూ.6.74 కోట్లతో అభివృద్ధి పనులు

మండలంలో రూ.6.74 కోట్లతో అభివృద్ధి పనులు పట్టామని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ప్రధానంగా రూ.4.43 కోట్లతో రహదారులు నిర్మాణం, నాడు – నేడు పథకం కింద రూ.96 లక్షలతో పాఠశాలల ఆధునికీకరణ జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.దేవేంద్ర, ఉప సర్పంచ్ అబ్దుల్ రెహమాన్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జ్ చెంగల్‌రెడ్డి, కన్వీనర్ నాగార్జునరెడ్డి, సీనియర్ నాయకులు హరినాథ్‌రెడ్డి, వెంకట సిద్దులు, బాబునాయుడు, షేక్ సుభాన్, సయ్యద్ ఇసూబ్, ఇమ్రాన్, రెడ్డి శేఖర్, బాలకృష్ణ, రెడ్డెప్పరెడ్డి, పంచాయతీ కన్వీనర్ జయంత్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి.. పిట్టగోడను ఢీకొట్టి..



డివైడర్ ఢీకొన్న టెంపో

తిరుమల : శ్రీవారి దర్శనార్థం తమిళనాడు, కాంచీపురానికి చెందిన భక్తులు టెంపో ట్రావెలర్ వాహనంలో ఆదివారం తిరుమలకు చేరుకున్నారు. సోమవారం శ్రీవారిని దర్శించుకుని మొదటి ఘాట్ రోడ్డు మీదుగా తిరుమల నుంచి అలిపిరికి బయలుదేరారు. మార్గమధ్యంలో వీరి వాహనం ఘాట్‌రోడ్డు చివరి మలుపువద్ద అదుపుతప్పి రక్షణగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాయపడిన వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. బ్రేక్‌లు ఫెయిల్ కావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు డ్రైవర్ తెలిపారు.

దోపిడీ 'ఖ'నిజం!

సైదాపురం: విలువైన ఖనిజం కోసం రాత్రికి రాత్రే కొండను తవ్వేసిన ఘటన మండలంలో కలకలం రేపుతోంది. వివరాలు.. సైదాపురానికి పది కిలోమీటర్ల దూరంలో తురిమెర్ల గ్రామం ఉంది. దీనికి సమీపంలో పురాతనమైన ఈన్నరాల తిప్ప ఉంది. ఇది సర్వే నం.359–1, 461, 446లో సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. కొందరు అక్రమార్కుల కన్ను కొండపై పడింది. రాత్రి రాత్రే యంత్రాలతో కొండలో ఉన్న విలువైన ఖనిజాన్ని తవ్వేస్తున్నారు. ఇప్పటికే రూ.2 కోట్ల మేర ఖనిజ సంపదను తరలించినట్టు స్థానికులు చెబుతున్నారు.



కఠిన చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ అనుమతు లేకుండా అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవు. ఈన్నరాల తిప్పలో తవ్వకాలు జరుగుతున్నట్టు ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదు.

– శ్రీనివాసరావు, జిల్లా మైనింగ్ అధికారి(ఏడీఎంజీ)

అగ్నిప్రమాదంలో వ్యక్తి మృతి

పుంగనూరు : మండలంలోని మార్లపల్లెలో ఆదివారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో సి.నిరంజన్(45) అనే వ్యక్తి మృతి చెందా డు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు కథనం మేరకు.. నిరంజన్ తన ఇంట్లో దోమల నివారణకు పొగ వేసుకుని నిద్రించాడు. ఈ క్రమంలో మంటలు వ్యాపించి ఇల్లుతోపాటు నిరంజన్ కూడా దహనమయ్యాడు. ఎస్ఐ మోహన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నాగలాపురం ఎర్ర చెరువు ఖాళీ



ఎర్ర చెరువు కట్టపై అనధికారికంగా నిర్మించిన గుడిసెలను తొలగిస్తున్న అధికారులు, పోలీసులు



ఎర్రచెరువు తూమును పరిశీలిస్తున్న స్థానికులు

- చేపల వేలం పేరుతో నీరంతా బయటకు విడుదల
- రైతుల ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరిగేషన్ అధికారులు

పిచ్చాటూరు: నాగలాపురంలోని అరణియార్ అనుబంధ ఎర్ర చెరువు మూడు నెలలు తిరక్కముందే ఖాళీ అయ్యింది. 770 ఎకరాల ఆయకట్ట కలిగిన ఈ చెరువు డిసెంబర్‌లో పూర్తిస్థాయిలో నిండింది. కనీసం ఒక్క పంట కూడా పండకముందే చెరువులోని నీరంతా ఖాళీ కావడంపై ఆయకట్టు రైతులు ఆందోళనకు దిగారు. చెరువులో చేపల వేలం పాడిన కొందరు నీరు ఖాళీ చేసినట్టు నాగలాపురం సర్పంచ్, మండల రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై పేర్కొన్నారు. చెరువు తూముకు ఉన్న రాడ్డును పగులగొట్టి నీటికి వృథా చేశారని, పగులగొట్టిన తూము రాడ్డు కూడా ఎత్తుకెళ్లారని ఆరోపించారు. చెరువు నిండే ప్రతిసారీ ఇదే విధంగా జరుగుతోందని, ఈ సమస్యను పరిష్కరించి తమ పంటలను కాపాడాలని కోరారు.

నీటిని వృథాచేస్తే చర్యలు తప్పవు

స్పందించిన రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై అరణియార్ ఇరిగేషన్ అధికారులకు సమస్యను వివరించారు. స్పందించిన ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్‌రెడ్డి, నాగలాపురానికి చెందిన ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పోలీసు అధికారులు ఎర్రచెరువు వద్దకు చేరుకుని నీటిని పరిశీలించారు. చెరువుకట్టపై ఏర్పాటు చేసిన గుడిసెలను తొలగించారు. రాడ్డులేని తూముకు మరో రాడ్డును తెచ్చి అమర్చారు. అనంతరం ఇరిగేషన్ ఏఈ మాట్లాడుతూ ఇది అరణియార్‌కు చెందిన అనుబంధ చెరువు అని, ఇక్కడ చేపల వేలం వేసే అధికారం ఎవ్వరికీ లేదన్నారు. అయితే కొందరు అనధికారికంగా చేపలు వేలం పాట పాడామని నీటిని ఇష్టమొచ్చినట్టు బయటకు పంపేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యపై 2022లోనే తాము నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. మళ్లీ ఇలాంటి పరిస్థితి ఎదురైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్‌ఓ నాగభూషణం, మండల రైతు సలహా మండలి అధ్యక్షుడు చిన్నదొరై పాల్గొన్నారు.